నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | జనవరి 03, 2025 | www.navatelangana.com

సావిత్రీబాయి పూలే జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోష శంకర్ అన్నారు. స్థానిక మాలి సంఘం నాయకులతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. మహిళా విద్యాభివృద్ధికి పాటుపడిన మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను గ్రామాలలో, మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ వేడుకల్లో మాలీలు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలీ సంఘం మాజీ అధ్యక్షులు వాఢై సుభాష్, శ్రీనివాస్, సోనే రావు, శ్రీకాంత్, నగష్ పాల్గొన్నారు.



జీఎంకు ఐఎన్‌టీయూసీ నాయకుల నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గని ఐఎన్టీయూసీ నాయకులు మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా జీఎం దేవేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ చింతం రవికిరణ్ పాల్గొన్నారు.



సీఎం, మంత్రుల ఫొటో మాస్కులతో నిరసన

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె కొనసాగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సీఎం తీరుకు నిరసనగా చేపడుతున్న సమ్మె గురువారం 24వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఫొటోలు ముఖానికి పెట్టుకొని నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట గల సమ్మె శిబిరం నుంచి ఉద్యోగులు ర్యాలీగా వచ్చారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం, మంత్రుల మాస్కులతో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. అధికారంలోకి వస్తే తమను రెగ్యులర్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు విస్మరించారని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆరోపించారు. 24 రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేపడుతున్న పట్టించుకోవడం లేదన్నారు. తాము సమ్మె ఉండడంతో పేద విద్యార్థులకు విద్య అందడం లేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, ప్రధాన కార్యదర్శి ధరమ్‌సింగ్, వెంకటి, పార్థసారథి, శ్రీకాంత్, ప్రవీణ్, కేశవ్ పాల్గొన్నారు.





అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ నియోజవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 సంవత్సరం నుండి నేటి వరకు జరిగిన అభివృద్ధి పనులతో పాటు నేటికీ కొనసాగుతున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ఎల్లవేళలా ప్రజా క్షేత్రంలో ఉంటూ బాధ్యతయుతంగా తమ కర్తవ్యాలను నిర్వర్తించాలన్నారు. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఎంపీడీఓలు ఎమ్మెల్యేకు కానుక అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ఎంపీడీఓలు రమాకాంత్, భాస్కర్, శశికళ, రాంప్రసాద్, అరుణ పాల్గొన్నారు.

దశల వారీగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం

- మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి



నవతెలంగాణ-భైంసా

దశలవారీగా ఇచ్చిన హామీలను నెరవేస్తామని, ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసి తీరుతామని కాంగ్రెస్ నాయకులు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి అన్నారు. గురువారం భైంసాకు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల అప్పులు భారమై, ఆర్థిక ఇబ్బందులతో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రెండు లక్షల వరకు రుణమాఫీ త్వరలో తమ ప్రభుత్వం చేయనున్నట్లు వెల్లడించారు. సంవత్సర కాలంలో దేశంలో ఎక్కడా లేని విధంగా రెండు లక్షల రూపాయల లోపు రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే నన్నారు. అప్పటి ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇష్టం వచ్చినట్లు జీవోలను జారీ చేసిందన్నారు. ప్రజలకు అవసరమైన పనులను కొనసాగిస్తామన్నారు. త్వరలో ఇందిరమ్మ పథకం కింద పేదలకు ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. అందులో భాగంగానే అధికారులు ఇంటింటికి వచ్చి పకడ్బందీగా సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వ హయాంలో వేలాది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. నోటిఫికేషన్‌లు ఎవరు ఇచ్చిన అమలు చేసిన వారికి ఆ ఘనత దక్కుతుందన్నారు. అదేవిధంగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ప్రతి ఏటా ఉద్యోగాలు ఇస్తున్నామన్నారు. నాలుగు సంవత్సరాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. సమావేశంలో నాయకులు ధర్మగౌడ్, నర్సారెడ్డి, కొట్టే హన్మండ్లు, దేవేందర్, నరేందర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆదివాసుల ఆందోళన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని కుమురం భీం కాలనీలో నివాసముంటున్న ఆదివాసులకు సౌకర్యాలు కల్పించాలని తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ అన్నారు. సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్‌తో గురువారం కాలనీ నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కరెంట్ స్తంభాలు, లైట్లు పోలిన వాటిని చూపిస్తు ఆందోళన చేపట్టారు. ధర్నా విషయమై పోలీసులు ముందస్తుగానే కలెక్టరేట్ ఎదుట భారీ పోలీసులను మోహరించి బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ మాట్లాడుతూ కుమురం భీం కాలనీలో నివాసముంటున్న ఆదివాసులకు విద్య, వైద్యం, కరెంట్ లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు జిల్లా కేంద్రంలోని కుమురం భీం కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. పట్టాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని దరఖాస్తులు ఇచ్చినా, దండాలు పెట్టినా ఎలాంటి చర్యలు లేవన్నారు. తాము ఆదివాసులుగా పుట్టడం నేరమా? అని ప్రశ్నించారు. కరెంట్ లేకపోవడంతో రాత్రి సమయంలో విషసర్పలతో సహజీవనం చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి వారి వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, విద్యార్థి సంఘం జిల్లా ఉపధ్యక్షులు వరుణ్, మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్, మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు లలితబాయి, డివిజన్ ఉపాధ్యక్షులు గణపతి, రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు భుజంగ్‌రావ్, రైతు సంఘం డివిజన్ ఉపాధ్యక్షులు తులసీరాం, మావల మండల అధ్యక్షుడు ముకుంద్‌రావ్, రూరల్ మండల అధ్యక్షులు కేశవ్ పాల్గొన్నారు.





నాణ్యత లేదన్న సాకుతో పత్తి రైతులకు సీసీఐ మోసం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పత్తి నాణ్యతలేదని కుంటి సాకుతో రైతులను సీసీఐ అధికారులు మోసం చేస్తున్నారని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంద్రవెల్లి, నార్నూర్, బేల, ఇచ్చోడ, గుడిహత్నూర్ మార్కెట్‌లో జిన్నింగులు ఉన్నా ప్రయివేట్ వ్యాపారస్తులు రైతుల నుండి అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే పత్తిని తన గుప్పెట్లో ఉన్న రైతులకు రూ.5వేల నుండి రూ.8 వేల వరకు కమీషన్ ఇచ్చి ఆ రైతు పేరున అమ్ముతున్నారని అన్నారు. దీనిపై నిజమైన రైతులు అయితే ఒక్కొక్క రైతు పేరున భూమి కొంత ఉండి పత్తి వందల క్వింటాళ్లు అమ్ముతున్నారని పేర్కొన్నారు. మరో పక్క కౌలు రైతుల పేరిట సెల్ఫీ డిక్లరేషన్ పేరిట మరొక మోసం జరుగుతుందన్నారు. దీనిపై కలెక్టర్ విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ చేయించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, గంగయ్య, ఖాదీర్, దిలీఫ్, జంగు పాల్గొన్నారు.

సత్వర న్యాయం జరిగేలా చూడాలి

- జోడేఘాట్‌ను సందర్శించిన ఏఎస్పీ చిత్తరంజన్



నవతెలంగాణ-కెరమెరి

ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చిత్తరంజన్ గురువారం మండలంలోని గిరిజన పోరాట వీరుడు కుమురం భీం అమరుడైన పోరుగడ్డను సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా కుమురం భీం నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి, సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మ్యూజియాన్ని సందర్శించారు. సంగ్రాలయంలో ఏర్పాటు చేసిన భీం అనుచరుల ప్రతిమలు, ఆదివాసీ గిరిజనుల సాంస్కృతిక, సంప్రాదాయాలను ప్రతిబింబించే విధంగా ఏర్పాటు చేసిన భీం అనుచరుల నమూనా చిత్రాలను తిలకరించారు. ఆదివాసులు వ్యవసాయంలో వినియోగించే పనిముట్లను పరిశీలించారు. పండించే పంటలు, ఆహారపు అలవాట్లు జీవన విధానం, నైజాం ప్రభుత్వంతో పోరాడిన తీరుతెన్నుల వివరాలను మ్యూజియం రికార్డు అసిస్టెంట్ గంగును అడిగి తెలుసుకున్నారు. స్థానిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధనపై ఆరా తీశారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కెరమెరి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మారుమూల పేద గిరిజనులకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సహాయం అందిస్తామన్నారు. ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం జరిగేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై గుంపుల విజయ్‌కుమార్, గ్రామ పటేల్ పెందూర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సహకార సంఘాలు రైతుల పరపతిని పెంచాలి

- మంచిర్యాల అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్



నవతెలంగాణ-నస్పూర్

సహకార సంఘాలు రైతుల పరపతిని పెంచి ఆర్థికంగా పరిపుష్టం చేయాలని, రైతులకు విశిష్టమైన సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పునర్విభజన అంశంపై జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు శంకర్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఎజీఎం రామకృష్ణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతితో కలిసి సహకార సంఘాల ప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారులు, బ్యాంక్ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదనలు అందించే సమయంలో సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టిత, వ్యాపార లావాదేవీలు, సంఘ సిబ్బంది వివరాలు, భౌగోళిక సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఉపయోగపడే విధంగా పునర్విభజన జరగాలని తెలిపారు. గ్రామీణ రైతుల అవసరాల ప్రాతిపదికన నూతనంగా ఏర్పడిన రెవెన్యూ మండలాల ప్రాతిపదికన రైతు సహకార సంఘాల పునర్విభజన చేయాలని తెలిపారు. సహకార సంఘాల పునర్విభజన రైతులకు ప్రయోజనకరంగా ఉండాలని తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈఓ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం డీఐఈఓ రవీందర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల హాజరు పట్టిక, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని మంచి ప్రణాళిక ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోధించాలని అన్నారు. రానున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి అయ్యేలా చూడాలని అధ్యాపక బృందానికి సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షల కొరకు సన్నద్ధమవుతున్న మైనారిటీస్ అభ్యర్థులకు జిల్లాలో ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించనున్నట్టు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి ఆర్.మోహన్‌సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్, గ్రూప్-2, గ్రూప్ -3, గ్రూప్ -4 పరీక్షల కోసం కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పోటీ పరీక్షలు, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు లాంటి పోటీ పరీక్షల కోసం ఆఫ్‌లైన్ ద్వారా డిగ్రీ పూర్తి చేసుకున్న మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఈ ఉచిత శిక్షణ 4 నెలలు ఉంటుందని, అర్హత, ఆసక్తి కలిగిన మైనారిటీస్ అభ్యర్థులు(ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు బౌద్ధులు, జైనులు, పార్సికులు) తమ దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డ్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, డిగ్రీ మార్క్స్ మెమో, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు(2)తో నూతన కలెక్టర్ ఆఫీసు భవన సముదాయములోని మొదటి అంతస్తు ఎఫ్-3లోగల జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో జనవరి-10 లోపు అందజేయాలని తెలిపారు.

నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఇచ్చోడ

టీఎస్‌యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని మండల విద్యాధికారి కసావత్ బిక్కుసింగ్ గురువారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయం వద్ద సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కాల దిన సమాచారాన్ని తెలుసుకోవడానికి ప్రతి ఏడాది క్యాలెండర్, డైరీలను టీఎస్‌యూటీఫ్ ఆధ్వర్యంలో తీయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్షులు రాజేందర్, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్, ఉపాధ్యక్షులు శ్రీధర్, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ జోషి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | జనవరి 03, 2025 | www.navatelangana.com

నష్టపరిహారం చెక్కు అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

పులిదాడిలో మృతి చెందిన ఆవు యజమానికి నష్టపరిహార చెక్కును గురువారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అందజేశారు. మండలంలోని వంకతుమ్మ(బి) గ్రామంలో ఇటీవల పెద్దపులి దాడిలో రైతు



చాహకటి జంగుకు చెందిన ఆవు మృతి చెందింది. ఈ మేరకు బాధిత రైతుకు రూ.40వేల నష్టపరిహార చెక్కును ఖానాపూర్ ఎమ్మెల్యే, వైల్డ్ లైఫ్ బోర్డ్ కమిటీ మెంబర్ వెడ్మ బొజ్జు పటేల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీర్సాయిపేట్ ఎఫ్ఆర్ఓ అరుణ, కవ్వాల్ టైగర్ జోన్ డిప్యూటీ రెంజర్ సీతారాం, బీట్ ఆఫీసర్లు కోసేరావ్, రాజకుమార్ ఉన్నారు.

బోథ్ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను బీఆర్ఎస్ మండల నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని, ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటన్న, చందు, రోహిదాస్, సూర్యకాంత్, మహదు పటేల్, కోసేరావ్ పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన దీక్షలు గురువారం 24వ రోజు వినూత్న రీతిలో కొనసాగాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయ సమీపంలో రోబో అవతారంలో నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీగా ఉన్న సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వీరికి సంఘీభావంగా పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు ఎంసీ లింగన్న మాట్లాడుతూ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘ సభ్యులు గంగాధర్, రాజారత్నం, ఫిరోజ్, నవిత, నరేష్, ముత్యం, గీతరాణి, పుష్ప లత, లక్ష్మి రవి, ఆనంద్, సమస్త నిర్మల్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డా.శివకృష్ణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బోథ్ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డా. శివకృష్ణను నియమిస్తూ టీజీటీడబ్ల్యూఆర్ఈఐ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 14 మందికి ప్రమోషన్లు ఇస్తూ డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి శివకృష్ణ ఒక్కరికే అవకాశం లభించింది. కెమిస్ట్రీ లెక్చరర్‌గా ఉన్న డా.శివకృష్ణ ఇప్పుడు గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా వ్యవహరించనున్నారు. కొత్త ప్రిన్సిపాళ్లకు వెంటనే బాధ్యతలు అప్పగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కళాశాల సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

సావిత్రీబాయి పూలే జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని జనవరి 3 శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు, బహుజన కుల సంఘాలు, మాలి కులస్తులు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకొని విజయవంతం చేయాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆవరణలో గల పూలే దంపతుల విగ్రహాల ఎదుట కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే తలమడుగు మండలం సుంకిడి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు



నవతెలంగాణ-ఉట్నూర్

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పార్టీ గెలుపునకు, బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేసి అదే విధంగా బీఆర్ఎస్, బీఆర్ ఎస్వీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించుకుంటామని అన్నారు. అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేసి, బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

18వ రోజు కొనసాగుతున్న సీఆర్టీల సమ్మె



నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ ఎదుట గిరిజన ఆశ్రమ పాఠశాల సీఆర్టీల సమ్మె గురువారం 18వ రోజుకు చేరుకుంది. అనప్పటికీ సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని సీఆర్టీల సంఘం నాయకులు వినంత, రమేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఆర్టీల డిమాండ్లను అమలు చేసే వరకు సమ్మె యధావిధిగా కొనసాగుతుందన్నారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో 1200 మంది సీఆర్టీలకు నెల వారీగా వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సమ్మెలో సీఆర్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన జాతర పనులు పూర్తి చేయాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఈనెల 28న ఆరంభమయ్యే కేస్లాపూర్‌లోని నాగోబా జాతర పనులను ఐటీడీఏ పరిధిలోని వివిధ శాఖల అధికారులు యుద్ధ ప్రతిపాధికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం కేస్లాపూర్‌లోని నాగోబా దర్బార్ హాల్‌లో ఐటీడీఏ పరిధిలోని వివిధ శాఖల అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా వివిధ శాఖల అధికారులకు అప్పగించిన పనులను ఈనెల 20లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా దేవాదాయశాఖ విద్యుత్ అలంకరణ, గుడికి రంగులతో పాటు వీఐపీలకు ఇన్విటేషన్‌లు, తైబజార్ వేలం తదితర పనులను పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ సానిటేషన్‌తో పాటు అవసరమైన చోట తాగు నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీటి శాఖ వారు భక్తులకు అవసరమగు మరుగుదొడ్లు, స్నానపు వాటికలతో పాటు 24 గంటలు తాగు నీటి ట్యాంకర్లను ఏర్పాటు ఆవశ్యకతను చేయాలన్నారు. జాతర ఆవరణలో వివిధ స్టాళ్లను ఏర్పాటు చేసే బాధ్యత డీఆర్డీఓ, సీడీపీఓ ఆదేశించారు. ప్లాస్టిక్‌ను నిషేధించి, క్లాత్ బ్యాగులను వాడాలని ఐటీడీఏ పీఓ అధికారులకు సూచించారు. ఐటీడీఏ అధికారులకు వివిధ గ్రామాలకు ఐదు చోట్ల గ్రావెల్ రోడ్లను నిర్మించాలని పేర్కొన్నారు. హెలిప్యాడ్‌తో పాటు ప్రధాన రోడ్డు నుంచి ఆలయం వరకు బారికేడ్‌లను ఏర్పాటు చేసే బాధ్యత అర్ అండ్ బి. ఈఈ నర్సయ్యకు అప్పగించారు. దీంతో పాటు హోటళ్లలోని తినుబండారాల తనిఖీ, వైద్య శిబిరాల ఏర్పాటు, నిరంతరంగా విద్యుత్ సరఫరా, భక్తులు రద్దీగా ఉండే గ్రామాలకు తగిన బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెల 20లోపు వివిధ శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా నాగోబా జాతర ఏర్పాట్లను చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ గౌస్ అలం, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ పటేల్, వెంకట్‌రావ్, పీవీటీజీ ఏపీఓ మెస్రం మనోహర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నామని పరిశ్రమలశాఖ జీఎం పద్మభూషన్‌రాజు అన్నారు. గురువారం పరిశ్రమల శాఖలో వివిధ రుణాలను దరఖాస్తుల వారీ ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని నిరుద్యోగులు కార్యాలయానికి చేరుకొని, వారి దరఖాస్తులను మేనేజర్‌కు అందించారు. వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు మాట్లాడుతూ నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. వాటి గురించి సరైన అవగాహన లేని కారణంగా పొందలేకపోతున్నారన్నారు. అందుకే ప్రతి సోమవారం, గురువారం రెండు రోజుల ప్రత్యేకంగా ఫిర్యాదుల విభాగం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎలా దరఖాస్తులు చేసుకోవాలి, ఎవరిని సంప్రదించాలి. సబ్సిడీ ఎంత వస్తుంది. తదితర వాటిని వారికి క్లుప్తంగా వివరిస్తామన్నారు. అంతే కాకుండా పరిశ్రమల శాఖల నుంచి అందే సబ్సిడీ గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, టీ ప్రైడ్, టీ ఐడియా లాంటి పథకాలను వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీఎం సునంద, డీఆర్పీ శివ, సీఎస్ఈ సెంటర్ నిర్వాహకులు రాహుల్, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ అజారోద్దిన్ పాల్గొన్నారు.

రక్తదానం ఆపదలో ఉన్న వారికి ప్రాణరక్ష

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి నిండు ప్రాణాన్ని రక్షించిన వారమవుతామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పిట్ట బొంగరంలో నవయుగ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్, పీఓ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్త దానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి నిండు ప్రాణాన్ని కాపాడవచ్చున్నారు. రోడ్డు ప్రమాదాలు, డెలివరీ అత్యవసర సమయాల్లో ఈ రక్తం ఎందరికో ప్రాణ భిక్ష పెడుతోందని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఈ యువకులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు, మహిళలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, గ్రామస్తులు సీడాం భీంరావ్, శేఖర్ పాల్గొన్నారు.


వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ-బోథ్

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డ్‌లో వీఓఏల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు ఎస్.స్వామి మాట్లాడుతూ సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, అలాగే హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వేతనం పెంచి సెర్ప్ నుంచి గుర్తింపు కార్డు ఇవ్వాలని, వీఓఏ వేతనం వ్యక్తిగత అకౌంట్‌లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం బోథ్ మండలాధ్యక్షులు ఎన్నికలు నిర్వహించారు. బోథ్ మండల అధ్యక్షులుగా ఎస్.స్వామి, కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వప్న, కోశాధికారిగా రంజిత్ కుమార్, సాహయ కార్యదర్శిగా మధుసూదన్, అలాగే సొనాల మండలాధ్యక్షులుగా పవర్ శ్యామ్‌రావు, కార్యదర్శిగా బత్తుల రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాణిక్‌రావు, సహా కార్యదర్శిగా సంగ్రామ్, కోశాధికారిగా నాగరాణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వీఓఏ సభ్యులు పాల్గొన్నారు.

ట్రెజరీ అధికారిణిని కలిసిన పెన్షనర్స్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శశికాంత్ జిల్లా ట్రెజరీ అధికారిణి హారికను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి, క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. పెన్షనర్స్ సమస్యలను వివరించగా, ఆమె సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. సర్వీస్ పూర్తయిన పెన్షనర్స్ కమ్యుటేషన్ వెంటనే జమ చేస్తామని కోర్టుకు వెళ్లాల్సి అవసరం లేదని తెలిపారు. అలాగే ఎస్టీఓ నరేశ్‌ను సూపరింటెండెంట్ నవీన్‌ను కలిసి వారికి డైరీ, క్యాలెండర్‌ను అందించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు నూతుల దయాకర్‌రెడ్డి, కార్యదర్శి జగన్ మోహన్, బాపురావ్, దేవిదాస్, రాజవర్ధన్, ఉమాకాంత్, జిలానీ, షబ్బీర్, మస్తాన్, ముఖీద్ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం భారతి మల్టీపర్పస్ ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇచ్చామని డాక్టర్ సర్పరాజ్ తెలిపారు. గత నెల నుంచి మూడు నెలలు అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 35 మంది విద్యార్థులు శిక్షణ నిమిత్తం వచ్చారని అన్నారు. వారికి 10 సెంటర్‌లకు ముగ్గురు చొప్పున నెలరోజు పంపించామని తెలిపారు. మళ్లీ వారికి సబ్ సెంటర్ మార్చామని అన్నారు. వారు నెలలో ఏం నేర్చుకొన్నారో అడిగి తెలుసుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంకోలి డాక్టర్ సూచన మేరకు హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, వారికి తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ శిక్షణలో హెల్త్ సూపర్‌వైజర్ శకుంతల, ప్రేమ్‌సింగ్, హెల్త్ అసిస్టెంట్, శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో ఖాళీగా ఉన్న కంప్యూటర్ సైన్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.జె.సంగీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ సంబంధిత సబ్జెక్టులో కనీసం 55శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉన్నా అర్హులేనన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలతో జనవరి 4వ తేదీ, శనివారంలోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించి, 6వ తేదీ సోమవారం జరిగే డెమోకు ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన బోథ్ నాయకులు



నవతెలంగాణ-బోథ్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను గురువారం బోథ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ప్రశాంత్, యూత్ ప్రెసిడెంట్ మెడిచేల్మ ప్రవీణ్, సొనాల గ్రామ కమిటీ అధ్యక్షుడు సోమన్న, మాజీ ఉపసర్పంచ్ రవి పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉట్నూర్

నవతెలంగాణ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆవిష్కరించారు. అనంతరం డివిజన్ ఇన్‌చార్జీ గోపి, ఉట్నూర్ మండల రిపోర్టర్ జాదవ్ వసంతరావులు ఎమ్మెల్యేకు నవతెలంగాణ నూతన సంవత్సరం డైరీని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి పోరాడే శక్తి నవతెలంగాణ దిన పత్రికకి ఉందని నిరంతరం ప్రజల బాగు కోసమే ఆలోచించే పేపర్ అని అన్నారు. పేపర్ యాజమాన్యానికి, రిపోర్టర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



నవతెలంగాణ-లోకేశ్వరం

పంచాయతీ నూతన కార్యదర్శిగా కోల్కొండ రాజేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో గ్రామ యువకులు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహస్వామి, పెద్దోల్ల సాయిలు, రాజు, పత్తిరెడ్డి సుదీర్, శపురం గంగాధర్, కొండపూర్ రాజేశ్వర్ పాల్గొన్నారు. కాగా ఇక్కడ విధులు నిర్వహించిన గందం వినయ్‌సాయి కుభీర్ మండలం సోనారీకి బదిలీపై వెళ్లారు.

టైలరింగ్, డ్రాయింగ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

టైలరింగ్, డ్రాయింగ్ వంటి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు అయిన టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలు, డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు ఈనెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందని, పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

కొనసాగుతున్న హమాలీల సమ్మె

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. రెండవ రోజు గురువారం జిల్లా ఉపాధ్యక్షులు కుమారు మాట్లాడుతూ పెరిగిన రేట్ల జీఓ వెంటనే విడుదల చేయాలని, ఏరియర్స్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, రూ.10లక్షల బీమా, హమాలీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, భూమిని నిరుపేదలకు మూడు ఎకరాల భూమి, నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలనుకుంటున్న నగదు బదిలీని వెంటనే రద్దుయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మె శిబిరంలో సత్యనారాయణ, కిషన్, అంజి, సురేష్ పాల్గొన్నారు.

పెన్షన్ ఆక్రోష్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ జనవరి 5న ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ గ్రౌండ్‌లో ఆదిలాబాద్ పెన్షన్ ఆక్రోష్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందనిటీఎస్‌సీపీఎస్‌ఈయు జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి తెలిపారు. గురువారం ఇరిగేషన్ కార్యాలయంలో ఆక్రోష్‌కు సంబంధించిన గోడ ప్రతులను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ఉద్యోగులకు సామాజిక భద్రత లేని ఈ పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగుల శ్రీనివాస్, డీఏఓ సిద్ధిక్, ఏఈఈ రాజ్ కుమార్, తేజస్విని, సూపరింటెండెంట్ జ్యోతి, డీఈ భద్రయ్య, బబ్లూ చంద్ర మండల్, అభిలాష్, నానాజీ, పద్మావతి, పోచమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

నవతెలంగాణ-వాంకిడి



రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి తలకు బలమైన గాయంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తలకు హెల్మెట్ లేకపోవడం వల్లే ఉపాధ్యాయుడి మరణించాడని పోలీసులు చెపుతున్నారు. గురువారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన తోట గంగాధర్(30) ఖమాన గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి మృతి చెందాడు. గంగాధర్ మండలంలోని నవెగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం కాగజ్‌నగర్ వైపు నుండి వస్తున్న సమయంలో కమానా గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో గంగాధర్‌ను అక్కడి నుండి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. గంగాధర్ ద్విచక్ర వాహనం నుండి కిందపడగా ఆయన తలకు ఎలాంటి రక్షణ లేకపోవడం వల్ల బలమైన గాయాలయ్యాయి. తలకు తీవ్రగాయమై ఎక్కువగా రక్తస్రవం అవడంతో పరిస్థితి విషమంగా మారింది. ఒకవేళ గంగాధర్ హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పేదని, తలకు గాయాలు కావడం, రక్తం ఎక్కువగా పోవడమే మృతికి ప్రధాన కారణమని ఎస్ఐ తెలిపారు.

జెండా పండుగను ఘనంగా నిర్వహించుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఈనెల 8న ఆదివాసీ జెండా పండుగను అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గంట గోపాల్ అన్నారు. గురువారం మండలంలోని కేశవపట్నం, భూపాలపల్లి గ్రామాలలో జిల్లా బృందంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 23వ భీమదేవరా జెండా పండుగను కొలవార్ ఆత్మగౌరవ దినోత్సవం పురస్కరించుకొని ప్రతి గ్రామంలో ఆదివాసీ కుటుంబ సభ్యులు జెండాలను ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం గంగన్న, జిల్లా సహాయ కార్యదర్శి బోట్లకుంట శ్రీనివాస్, రాసపల్లి గంగాధర్, కోడప భీమయ్య, కోడప సద్వొలేష్, లింగయ్య, మెట్టిపల్లి కొమురయ్య, బుర్స పోషమల్లు, మెర్పల్లి భూమయ్య, నాయిని రాకేష్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూటీఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మండల అధ్యక్షుడు యాదగిరి, ఎస్ఐ కొమురయ్య పాఠశాల సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు గంగాభవాని, ఉపాధ్యాయులు వడె సాహెబ్, లక్ష్మీ, సంతోష్, ప్రియాంక, భారతి, తిరుమల, నాగరాణి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించిన మొగవెల్లి యూత్ సభ్యులు

నవతెలంగాణ-బెజ్జూర్

బైక్ అదుపు తప్పి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన మొగవెల్లి గ్రామానికి చెందిన ఆత్రం షణ్ముఖకు మొగవెల్లి దుర్గాదేవి యూత్ సభ్యులు అండగా నిలిచారు. గురువారం రూ.18,100 ఆర్థిక సాయం అందించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై హైదరాబాద్‌లో యశోద ఆస్పత్రిలో ఆత్రం షణ్ముఖ చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించినట్టు యువకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం సత్తయ్య గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు జిల్లాలోని అర్హత గల మైనారిటీ అభ్యర్థుల నుండి ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రమాదేవి ఒక ప్రకటంలో పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ అభ్యర్థులు అర్హులని ఆసక్తిగలవారు ఈనెల 10లోపు జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపిక చేసినవారికి నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం రెబ్బెన మండలంలోని దీవులగూడ సమీపంలో జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మెడికల్ కళాశాలకు సుస్తీ

- మౌలిక వసతుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు
- మద్దతు తెలిపిన ప్రజా సంఘాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన మెడికల్ కళాశాల నిద్రావస్థ వీడటం లేదు. వైద్య విద్యార్థులకు కనీస వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించకుండానే మెడికల్ కళాశాల ప్రారంభించారు. అడ్మిషన్లు పూర్తయి ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం తరగతులు కొనసాగుతున్నాయి. కళాశాల ప్రారంభమైనా వైద్య విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ఫలితంగా వైద్య విద్యార్థులు వసతుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది.

మెడికల్ కళాశాలకు సుస్తీ

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాల్సిన వైద్య కళాశాలలో కనీస వసతులు కరువయ్యాయి. కళాశాలలో వివిధ సబ్జెక్టుల తరగతులు బోధించడానికి అవసరమైనంత ప్రొఫెసర్లు లేకపోవడం విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతోంది. మరోపక్క కళాశాల భవనం పెచ్చులూడిపోవడంతో పై నుంచి నీరు కారుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది.

మౌలిక వసతులు కరువు

మెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం కొనసాగుతుండగా మొత్తం 200 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరికి వసతి గృహాలు లేక ఐదు చోట్ల ఉంచాల్సిన పరిస్థితి వచ్చింది. పాత కలెక్టరేట్, డి ఆర్‌డిఓ కార్యాలయం, మార్కెట్ యార్డ్ కార్యాలయం, జిల్లా ఆసుపత్రి పక్క భవనంతో పాటు, నూతన భవనంలో కొంతమందికి వసతులు కల్పించారు. ఎక్కడ కూడా అవసరమైన మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు లేకపోవడం పరిశుభ్రత కానరాక పోవడంతో విద్యార్థులు రోడ్డెక్కారు.

మద్దతు తెలిపిన ప్రజా సంఘ నాయకులు

విద్యార్థులు చేసిన నిరసన కార్యక్రమానికి ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టీకానంద్, కార్తీక్, బీసీ యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మద్దతు తెలిపారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేని కలిసి వినతి పత్రం అందజేశారు.

పరిస్థితులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం.

దుర్గం దినకర్, కేవీపీఎస్, జిల్లా కార్యదర్శి

భావితరాలకు దిశ నిర్దేశకులుగా ఉండాల్సిన వైద్యులు మౌలిక వసతుల కోసం రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది. మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మౌలిక వసతుల కల్పనపై దృష్టి కేంద్రీకరించాలి. లేదంటే విద్యార్థులతో కలిసి రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం.

ప్రొఫెసర్లను వెంటనే నియమించాలి

పల్లవి, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని



ద్వితీయ సంవత్సరానికి వచ్చినప్పటికీ ప్రొఫెసర్లు లేకపోవడంతో తరగతులు పూర్తికాక రాష్ట్రంలోని మిగతా జిల్లాల విద్యార్థులతో పోటీ పడలేని పరిస్థితి తయారైంది. ప్రొఫెసర్లను నియమించి తరగతులు జరిగేలా చూడాలి. మంత్రికి గతంలో విషయం మొత్తం తెలిపినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వెంటనే తమ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలి.

వసతి గృహాలు ఏర్పాటు చేయాలి

సూర్య ప్రకాష్ రెడ్డి, ద్వితీయ సంవత్సరం



మౌలిక వస్తువులు లేకపోవడంతో ఎంబిబిఎస్ చేస్తున్నామని ఆలోచన కూడా మాకు కలగడం లేదు. వసతి గృహాలు కూడా ఉండలేని విధంగా తయారయ్యాయి. పలుమార్లు విన్నవించిన మార్పు లేకుండా పోతోంది. శాశ్వత ప్రాతిపదికన వసతి గృహాలు ఏర్పాటుచేసి ప్రభుత్వం, అధికారులు మా కష్టాలు తీర్చి ప్రశాంతంగా చదుకునేల చూడాలి

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-వాంకిడి



మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని బంబారా ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ముందుగా వంట గదిని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వసతి గృహ పరిసర ప్రాంతాలతో పాటు వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడంతో పాటు సర్వే పకడ్బందీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

- ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు
- ఆపరేషన్ స్మైల్‌పై సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ సమూలంగా నిర్మూలించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఆపరేషన్ స్మైల్ 11పై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించే 11వ ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పోలీసు, మహిళా అభివృద్ధి శిశుసంక్షేమం, కార్మిక, విద్య, ఆరోగ్య శాఖలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఎన్జీఓ అధికారులతో కలిసి జిల్లావ్యాప్తంగా రెండు సబ్ డివిజన్లలో రెండు టీంలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటితో బాలకార్మికులు, చిన్నారుల దుర్భర స్థితిలో ఉండే ప్రాంతాలను తెలుసుకొని వాటిని బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి చిన్నారులను విముక్తి కలిగించాలన్నారు. ప్రధానంగా రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, ట్రాఫిక్ కూడళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, టీస్టాళ్ళు, హోటల్లు, ఫ్యాక్టరీలు, వర్క్ షాప్‌లు, దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో చైల్డ్ ట్రాక్ పోర్టల్, ముఖ కవళికలను గుర్తించే దర్పణ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా సత్ఫలితాలనిచ్చిందన్నారు. గత సంవత్సరం జూలై నెలలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-10 కార్యక్రమం ద్వారా 68 మంది పిల్లలను రెస్క్యూ చేసినట్లు తెలియజేశారు. చట్టపరమైన విధానాపరమైన సమ్మతితో రెస్క్యూ కార్యక్రమాలను ఒక ప్రణాళిక ప్రకారం అమలు చేయాలని తెలిపారు. బాల కార్మికుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడానికి చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098,112 నెంబర్ల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్ రావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్, జిల్లా వైద్యాధికారి సీతారాం, డీఈఓ యాదయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఆనంద్ మేళా సిల్వర్ జూబ్లీ వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతి శాఖ వారి సౌజన్యంతో మోక్షిత డాన్స్ అకాడమీ, సేవాసమితి ఆధ్వర్యంలో ఆనంద్ మేళా సిల్వర్ జూబ్లీ వేడుకలలో భాగంగా జాతీయ నంది పురస్కారాల కార్యక్రమం ఎస్పీఎం గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఎస్పీఎం అడిషనల్ జీఎం గిరీష్ బాబు, డా.విద్యా సాగర్ హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ధూమ్‌ధాం ఆట, పాట కళాకారులు నృత్య కళాకారులకు పురస్కారాలు అందించారు. పురస్కారాలు తెలంగాణ రాష్ట్ర ధూమ్ ధాం వ్యవస్థాపక సభ్యులు అంతడ పుల నాగరాజు, సీనియర్ ఉద్యమ ఉత్తమ గాయకులు కుమురం భీం ఆసిఫాబాద్ టీటీఎస్ టీం లీడర్ కొప్పర్తి సురేందర్, ఓయూ జేఏసీ నాయకులు కవి ,గాయకులు దరువు అంజన్న, తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులు వేదిక రాష్ట్ర అధ్యక్షులు అనుమోజు వెంకటేశం, తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు నకిరేకంటి కిరణ్ కుమార్, ఉద్యమ కవి గాయకులు సుందిళ్ళ రాజన్న, తెలంగాణ ఉద్యమ గాయకులు,సీనియర్ ఉద్యమ కళాకారులు మహమ్మద్ ఇర్ఫాన్ హుస్సేన్ పురస్కారాలను అందించారు. కాగా అంతకు ముందు కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీచర్ మేడి చరందస్, రాజ్ కమలాకర్, కేశవ్ పాల్గొన్నారు.

నూతనోత్సాహంతో ఉత్పత్తి లక్ష్యాల సాధన



నవతెలంగాణ-రెబ్బెన

నూతనోత్సాహంతో పని చేసి ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. గురువారం గోలేటి జీఎం కార్యాలయ ఆవరణలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో ఇప్పటి వరకు 91 శాతం ఉత్పత్తి సాధించినట్టు చెప్పారు. రానున్న 90 రోజుల్లో 100 శాతం ఉత్పత్తి సాధించేందుకు ఉద్యోగులు ఉత్సాహంగా పని చేయాలన్నారు. 136 ఏండ్ల చరిత్ర ఉన్న సింగరేణి సంస్థను బావితరాలకు అందించేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. స్వచ్ఛతలో బెల్లంపల్లి ఏరియాకు ద్వితీయ బహుమతి రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఐయిదుగురికి ఉద్యోగోన్నతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, ఎస్ఓటూ జీఎం కె.రాజమల్లు, పీఓ ఎం.నరేందర్, పర్సనల్ మేనేజర్ ఆర్ తిరుపతి, ఎస్ఈ(సివిల్) మదీనా బాషా, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

'జర్నలిస్టు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది'



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కాపీని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి జర్నలిస్టులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎంతోకాలంగా ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం జర్నలిస్టులు ఎదురుచూస్తున్నారని, కాంగ్రెస్ హయాంలో భవనం నిర్మాణం చేపడతామని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో చేపట్టే నాలుగు పనుల కోసం రూ.57 లక్షలను ఎస్‌డీఎఫ్ నిధుల కింద మంజూరైనట్టు తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణంలో జర్నలిస్టుల భవన నిర్మాణానికి రూ.25 లక్షలు, గుండాల గ్రామంలో అభివృద్ధి పనులకు రూ. 8 లక్షలు, రెబ్బెన మండలం గంగపూర్ గ్రామంలో కమ్యూనిటీ షెడ్ల నిర్మాణం కోసం రూ.10 లక్షలు, ఆలయ ముఖ ద్వారం నిర్మాణం కోసం రూ.14 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వీలైనంత త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గాదవేని మల్లేష్, నాయకులు చరణ్, అబ్దుల్లా, అసద్, విశాల్, సలాం, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి



నవతెలంగాణ-కెరమెరి

ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయిత్ అన్నారు. గురువారం సుల్తాన్‌గూడ ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించి మాట్లాడారు. పాఠశాలలో 5 తరగతులు, 56 మంది విద్యార్థులున్నారని తెలిపారు. కేవలం ఉర్దూ బోధనకు ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉన్నారన్నారు. మరొకరిని స్థానిక ప్రాథమిక పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై నియమించారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో మైనార్టీ విద్యార్థులకు ఉర్దూ విద్య అందకుండా పోతుందన్నారు. సరైన ఉపాధ్యాయ సిబ్బంది లేని కారణంగా గత సంవత్సరం కంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలల్లో చేరుతున్నారన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజనం మెనూ పాటించడం లేదని ఆరోపించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో నూతన మెనూ అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్ బిల్డింగ్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్‌లో కరెంటు బోర్డులు ఊడి, వేలాడుతున్నాయని విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. అధికారులు స్పందించి స్విచ్ బోర్డులు సరిచేయాలన్నారు. ఆయనతో పాటు ఖుతుభోద్దీన్, సందీప్ కుమార్ ఉన్నారు.

ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఆంగ్ల మాధ్యమ బోధనతో కొనసాగుతున్న గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న పీటీజీ ప్రిన్సిపాల్ భద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మీ సేవ లేదా ఇంటర్నెట్ కేంద్రాలలో ఫిబ్రవరి 1లోపు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న ఉంటుందని, ఇతర వివరాల కోసం వెబ్ సైట్ సంప్రదించాలని పేర్కొన్నారు.

మన్మోహన్‌సింగ్ సంతాప సభ

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించారు. ఎమ్మెల్యే వినోద్ పాల్గొని ముందుగా మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక ఆర్థిక సంస్కరణలు అమలు చేసి భారత దేశాన్ని ముందుకు నడిపించిన మహనీయుడు మన్మోహన్ సింగ్‌అని అన్నారు. 1991లో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు నేతృత్వంలో అనేక ఆర్థిక సంస్కరణలు చేపట్టారని గుర్తు చేశారు. ప్రతి పేదవాడికి ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ-కాసిపేట



బెల్లంపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గడ్డం వినోద్‌కు మండల కాంగ్రెస్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. దీంతో పాటు ఇటీవల మండల అధ్యక్షుడు అరుణాచల ఈశ్వరుని యాత్ర సందర్భంగా త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావాలని పూజలు చేసినట్టు వివరించారు. అనంతరం దేవస్థానం శాలువ, లడ్డు ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, నాయకులు పులుగం వెంకటేష్, మేరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్‌తో కలిసి రోడ్డు భద్రతా మాసోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు ప్రమాదాల నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు, ఇతర వాహనాల చోధకులు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. కూడళ్ళ వద్ద సిగ్నల్స్‌ను అనుసరించాలని, నియంత్రిత వేగంతో వాహనాన్ని నడపాలని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించొద్దని,మద్యం సేవించి వాహనం నడపొద్దని, వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రతా నియమ, నిబంధనలను వివరిస్తూ ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేల వేతనాన్ని అమలు చేసి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ మధ్యాహ్నం భోజనం కార్మికులు నిరసన చేపట్టారు. కోడి గుడ్లు, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేసి ధరలకు అనుగుణంగ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.మధ్యాహ్న భోజన కార్మికులకు 4 నెలలుగా బిల్లులు, వేతనాలు రాకపోవడం మూలంగా అప్పుల పాలై వంట నిర్వాణ చేయడం కోసం మరిన్ని అప్పులు చేస్తున్నారని, గత ప్రభుత్వం అవలంభించిన తీరే కాంగ్రెస్ ప్రభుత్వం అవాలంబిస్తుందన్నారు. మధ్యాహ్నం భోజన కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతమన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన కార్మికులు దాసరి రాజేశ్వరి, మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్ మండలాల కార్మికులు పాల్గొన్నారు.

విజయం బీఆర్ఎస్ అభ్యర్థులదే

నవతెలంగాణ-జన్నారం



స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ బలపరిచే అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని పొనకల్ గ్రామంలో మాజీ ఎంపీపీ మాదాడి సరోజన, మాజీ పీఏసీఎస్ చైర్మన్ శీలం రమేష్‌ల ఆరోగ్యం బాగా లేనందున ఇంటికెళ్లి ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. పార్టీ కార్యకర్తలు నాయకులు ఐకమత్యంతో ఉండి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్ కుమార్, యూత్ అధ్యక్షులు పేరం శ్రీనివాస్, నాయకులు ఫజల్ ఖాన్, బలసాని శ్రీనివాస్ గౌడ్, రాగుల శంకర్, రాకేష్, నర్సాగౌడ్, కొండుకూరి రాజు స్వామి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతులతో సత్ఫలితాలు

నవతెలంగాణ-నస్పూర్

కార్మికులకు ప్రోత్సాహ బహుమతులు అందించడం ద్వారా సత్ఫలితాలు పొందవచ్చని ఏజెంట్ శ్రీధర్ అన్నారు. డిసెంబర్ నెలలో అధిక ఉత్పత్తి సాధించిన ఉద్యోగులకు గురువారం ఏజెంట్ శ్రీధర్, సుధీర్ కుమార్ ఝ ప్రోత్సాహ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల పర్యవేక్షణ, పూర్తి సహకారంతో ముందస్తు ప్రణాళికలతో ఆరు నెలలుగా మెరుగైన ఉత్పత్తి సాధిస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల్లో ఉత్పత్తి లక్ష్యం పట్ల పోటీ తత్వం పెంపొందించేలా చేపట్టిన ప్రోత్సాహ బహుమతుల విధానం త్వరితగతిన సత్ఫలితాలను అందించిందంటూ హర్షం వ్యక్తం చేశారు. గత నెలలో 96 శాతం ఉత్పత్తితో పాటు ఓఎంఎస్ 1.04 సాధించామన్నారు. ఉత్పత్తిలో స్వల్పంగా వెనుకబడ్డప్పటికీ మెరుగైన ఓఎంఎస్ సాధించిన స్ఫూర్తితో ఈ నెల టార్గెట్‌తో పాటు ఈ ఆర్థిక సంవత్సరం వంద శాతం ఉత్పత్తి లక్ష్యం సాధించేలా మరింత నిబద్ధతతో కృషి చేయాలన్నారు. ఇతర రిలే ఉద్యోగుల సైతం ప్రోత్సాహక బహుమతులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకా కొంత మంది ఉద్యోగులు విధులకు గైర్హాజరవ్వడం బాధాకరమని వారు కూడా విధిగా డ్యూటీ చేస్తూ ఉత్పత్తి లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి రాందాస్, సంక్షేమ అధికారి రణదీప్ గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ శివయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న గుడిసెవాసుల నిరసన

- ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో మొదటి ప్రాధాన్యత నివ్వాలి
- బావురావుపేట గుడిసెవాసుల డిమాండ్



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేద కుటుంబాల నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. నిరసనలో భాగంగా గురువారం ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో మొదటి ప్రాధాన్యతగా గుడిసెవాసులను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫ్లకార్డు ప్రదర్శించిన పేద కుటుంబాలకు చెందిన వారు బావురావుపేట్ శివారు సర్వే నెం.8లో గల ప్రభుత్వ భూమికి ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. బావురావుపేట్ శివారు సర్వే నెం.8లో గల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేద కుటుంబాల వారు ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్న గుడిసెవాసులు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో గుడిసెవాసులకు మొదటి ప్రాధాన్యతగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. రెండు సంవత్సరాలుగా ఎండలో ఎండుతూ వానలో తడుస్తూ చలిలో గుడెల్లో మగ్గుతుంటే ప్రభుత్వ పెద్దలు గుర్తించకపోవడం బాధాకరమని ఆవేధన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలు పంపిణీ చేయించాలని ఈ సందర్భంగా కోరారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఏరియా కార్యదర్శి బోడంకి చందు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా కనీస సౌకర్యాలు లేకుండా నిరుపేద కుటుంబాలకు చెందిన అనేకంగా అవస్థలు పడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలుగా కొనసాగిస్తున్న గుడిసె వాసుల పోరాటంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధకరమన్నారు..రాష్ట్ర ప్రభుత్వం గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇండ్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు ఇంటి జాగ కోసం పోరాడుతున్న పేదల ఆక్రందన గుర్తించక పోవడం ఎంటాని ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల ఆస్తులు కట్టబెడుతూ పేదవాళ్లకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం బాధకరమన్నారు. అభివృద్ధి అంటే పేదలకు విద్య, వైద్యం, కూడు, గూడు, ఉద్యోగం కల్పించినప్పుడే అని అన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు ఇక్కడ గుడిసెలు వేసుకున్న నిరుపేదల విషయంలో సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బండారి రాజేశ్వరి, అనసూర్య రేణుక, శ్యామల, వెంకటస్వామి, శ్రీనివాస్, గుడిసెవాసులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలి

నవతెలంగాణ-జన్నారం



బీడీ కార్మికులకు పెన్షన్లను మంజూరు చేయాలని బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) మండల నాయకులు దాసర్ల రాజన్న అన్నారు. గురువారం మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామ బీడీ అండ్ సిగర్ వర్కర్స్ యూనియన్ గ్రామ కమిటీ సమావేశం బియ్యాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీడీలు చుట్టే ప్రతి కార్మికురాలికి పెన్షన్లు మంజూరు చేయాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే అర్హులైన బీడీ కార్మికులకు అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేసి వారి సమస్యలు పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గ్రామ కమిటీ నాయకులు జంగిలి వనిత, నల్లపు మహేశ్వరి, కొట్టు లక్ష్మి, పెంకర్ల సత్తవ్వ, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

బర్ధన్ స్ఫూర్తితో ఉద్యమాలు : కలవేన శంకర్



నవతెలంగాణ-మంచిర్యాల

కమ్యూనిస్ట్ సైద్ధాంతిక తత్వవేత్త ఏబీ బర్ధన్ స్ఫూర్తితో ప్రజ సమస్యలపై ఉద్యమాలు కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో బర్ధన్ 9వ వర్ధంతిని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రజాసంఘాల నాయకులతో కలిసి బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీ బర్ధన్ తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను అనుసరించి ప్రజలు, కార్యకర్తలతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారని తెలిపారు. విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం బర్ధన్ చేసిన పోరాటాలకు ఉపరాష్ట్రపతి పదవీని ఇస్తామన్నప్పటికి పదవీని తీసుకోకుండా సున్నితంగా తిరస్కరించారని తెలిపారు. తన జీవితం ప్రజలు, పార్టీ కార్యకర్తలతోనే అని చెప్పడం బర్ధన్ నిస్వార్ధతకు అద్దం పడుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ ఆలీఖాన్, జోగుల మల్లయ్య, కారుకురి నగేష్, మిట్టపల్లి శ్రీనివాస్, లింగం రవి, మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, కుంచాల శంకరయ్య పాల్గొన్నారు.

తాండూర్ : బెల్లంపల్లి సీపీఐ కార్యాలయంలో గురువారం ఏబీ బర్ధన్ తొమ్మిదవ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి రాజమౌళి, సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య మాట్లాడుతూ ఏబీ బర్ధన్ 15వ వయసులో పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై నాగపూర్ యూనివర్సిటీలో స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో చేరి పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. 1957లో నాగపూర్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి గెలిచారన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా పనిచేసే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, బీకేఎస్‌యూ జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, జిల్లా సమితి సభ్యులు మేకల రాజేశం, పట్టణ సహాయ కార్యదర్శి కొంకుల రాజేష్, పట్టణ కార్యవర్గ సభ్యులు రత్నం రాజం, బొంకూర్ రామచందర్, పార్టీ నాయకులు స్వామిదాస్, ఇనుముల రాజమల్లు, రాధాకృష్ణ పాల్గొన్నారు.



సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



నవతెలంగాణ-నస్పూర్

సమాజ నిర్మాణంలో ఉద్యోగుల పాత్ర కీలకమని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. యాదయ్య అన్నారు. జిల్లా విద్యాశాఖాధి కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ 2025 డైయిరీ, క్యాలెండర్, అధ్యాపకదర్శిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి నాణ్యమైన విద్యను అందించడంలో తమ వంతు బాధ్యతను నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజావేణు మాట్లాడుతూ టీఎస్‌యూటీఎఫ్ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలు అనే కర్తవ్యాలతో పని చేస్తుందన్నారు. పాఠశాల విద్య బలోపేతానికి బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలన్నారు. సమగ్రశిక్ష, కేజీబీవీ, యూఆర్ఎస్, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేసే సీఆర్టీలకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేసీ సమ్మెను విరమింపజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను, అన్ని రకాల బిల్లులను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వి.కిరణ్ కుమార్, జిల్లా కోశాధికారి బి.కిరణ్, జిల్లా కార్యదర్శులు బి.దేవదాస్, కే.చంద్రమౌళి, అబ్దుల్ వాహిద్, పొచ్చన్న పాల్గొన్నారు.

పెరిగిన హమాలీ రేట్ల జీఓను విడుదల చేయాలి



నవతెలంగాణ-తాండూర్

పెరిగిన సివిల్ సప్లయ్ హమాలీ రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ కోరారు. గురువారం మండలంలోని రేచినిలో రెండవ రోజు నిరవధిక సమ్మె చేస్తున్న హమాలీ కార్మికులకు మద్దతు పలికి మాట్లాడారు. గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులకు పెంచిన రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి రేట్ల సవరణ చేస్తూ ప్రభుత్వం, పౌరసరపర శాఖ చిత్తశుద్ధితో హమాలీ రేట్లు పెంచటం జరుగుతుందని తెలిపారు. ఒప్పందం ప్రకారం జనవరి ఒకటి నుండి నుండి కొత్త రేట్ల ను వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉట్నూర్ అంకేష్, పెద్ద బోయిన లక్ష్మణ్, తాని శ్రీనివాస్, పెద్దబోయిన చందు, పెద్దబోయిన మహేందర్, మాచర్ల వెంకటేష్, జంగిడి భూమయ్య, సిద్ధంకి గణేష్, లింగం సుమలత, కొండు సాయికుమార్ పాల్గొన్నారు.

సొంతింటి పథకం అమలుకు వినతి



నవతెలంగాణ నస్పూర్

సింగరేణి కార్మికుల చిరకాల స్వప్నం సొంతింటి పథకం అమలుకు ప్రభుత్వానికి సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అధ్యక్షతన సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)అన్ని ఏరియాల బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు గురువారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు వినతిపత్రాం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలవెన్సులపై ఐటీ మాఫీ, మారు పేర్లు, సంస్థకు రావాల్సిన రూ.33 వేల కోట్ల బకాయిల చెల్లింపు వంటి సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరారు. సొంతింటి పథకం అమలు వలన అటు యాజమాన్యానికి ఇటు ప్రభుత్వానికి ఎలాంటి భారం పడకుండా అమలవుతుందనే విషయాన్ని వివరించడంతో ఆయన సానుకూలత వ్యక్తం చేసి త్వరలో ఈ విషయంపై యూనియన్‌తో సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ సలహాదారు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, అన్ని ఏరియాలో అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓరియంట్ క్వారీలో దారిని కొనసాగించేందుకు హామీ



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఫారెస్ట్ పరిధిలోని ఓరియంట్ క్వారీలో దారిని యధావిధిగా కొనసాగించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్టు ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. ఆదివాసులు ఏండ్ల నుంచి నడిచే క్వారీ దారిలోని గేటును పెద్ద పులి తిరుగుతుందనే నేపంతో ఫారెస్ట్ అధికారుల ఆదేశాలతో ఓరియంట్ అధికారులు గేటును మూసి దారిని నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మైన్స్ క్వారీ గేటు దారి విషయమై దేవాపూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారులతో పాటు ఓరియంట్ యాజమాన్యంతో చర్చించారు. దీంతో అధికారులు సానుకూలంగా స్పందించి యధావిధిగా గేటు దారి కొనసాగుతుందని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో ఆందోళన విరమించి ఆదివాసీ గ్రామ సభల అనుమతి లేకుండా ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న దారులను మూయవద్దని, ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కొమ్ముల బాపు, గ్రామ పటేళు ,, మాజీ సర్పంచులు, ఆదివాసీ సంఘాల నాయకులు కొమ్ముల బాపు, మడావి అనంతరావు, ఆడే జంగు, పెంద్రం రాజు, అచ్యుత్ రావు, కనక రాజు, వెడ్మ బాపురావు, శంకర్ పాల్గొన్నారు.

భూ కబ్జాలను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి తాజా మాజీ ఎమ్మెల్యేలు భూ కబ్జాలకు పాల్పడే రౌడీ షీటర్లను పెంచిపోసిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏమాజీ ఆరోపించారు. గురువారం భూ కబ్జా తగాదాల్లో గాయపడి మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరిజిన్ డైరీ ఎండీ ఆదినారాయణను పరామర్శించారు. ఆదినారాయణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆదినారాయణపై దుండగులు ప్రజలందరి సమక్షంలో బట్టల విప్పేసి నగ్నంగా చేసి విచక్షణారహితంగా మారణాయుధాలతో దాడి చేసి హత్యాయత్నం చేశారన్నారు. ఆయనకు తీవ్రంగా గాయలైన పోలీసులు నామమాత్రపు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పెంచి పోషించిన రౌడీ షీటర్లను, భూకబ్జాదారులను ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను రాజకీయ లబ్ధి కోసం కాపాడుతున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్న ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు యోగా శిక్షణ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో గురువారం ప్రత్యేక యోగ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ శిక్షకురాలు మునిగెల యోగిత విద్యార్థులకు యోగ ప్రాముఖ్యతపై వివరించి, ఆసనాలు విద్యార్థులతో వేయించారు. యోగతో శారీరక, మానసిక బావోద్వేగా శక్తి స్థాయిలను మెరుగుపరుస్తుందని అన్నారు. గురువారంతో బోథ్ మండలంలోని 10 ఆరోగ్య పాఠశాలలో యోగ శిక్షణ కార్యక్రమాలు నేటితో పూర్తి అయ్యాయని, యోగ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ప్రీతల్ రాథోడ్ అన్నారు. యోగ శిక్షణ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆధ్యాపక బృందం పాల్గొన్నారు.



సొమ్మసిల్లి పడిపోయిన సీఆర్టీ ఉద్యోగి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత 24 రోజులుగా ఉద్యోగ ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్న విషయం విదితమే. కాగా, గురువారం దీక్ష చేసేందుకు వచ్చిన సీఆర్టీ పద్మ అస్వస్థతకు గురై దీక్ష శిబిరంలో పడిపోయారు. దీంతో ఆమెను స్థానికులు పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.



క్రీడలతో మానసిక, శారీరక దారుఢ్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రీడలు మానసిక శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. ఆసిఫాబాద్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లోని ప్రేమల గార్డెన్ పక్కన గల మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు చరణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక శారీరక అభివృద్ధిని కలిగిస్తాయన్నారు. క్రీడాకారుల అభివృద్ధికి తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రీడా పోటీలు నిర్వహిస్తున్న యూత్ సభ్యులను అభినందించారు. నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 20 వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో మొత్తం 30 టీములు పాల్గొంటున్నాయని ప్రథమ బహుమతి రూ.30000, ద్వితీయ బహుమతి రూ.15000 అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, అబ్దుల్లా, అసద్, సలాం, నిర్వహణ కమిటీ సభ్యులు ఖలీల్, అఫ్రోజ్, ఆదిల్, జుబేర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు గురువారం నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ కొనసాగింది. జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారితో పాటు ఆర్డీఓ లోకేశ్వరరావు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులు డిపిఆర్ఓ సంపత్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ శాఖ ఉద్యోగులతో పాటు నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ములాఖత్..

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు నేతృత్వంలో జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పిటిసి సంతోష్, మసాడే చరణ్, హర్షద్ హుస్సేన్, విశ్వనాథ్, సుదర్శన్‌గౌడ్ ఇతర నాయకుల పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయాన్ని గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు అయ్యప్ప దీక్షపరులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం అయ్యప్ప స్వాములతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐటీడీఏ ఈఈ భీంరావు, ప్యాక్స్ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అయ్యప్ప స్వామి దీక్ష పరులు ఉన్నారు.

సమస్యలపై ఉపముఖ్యమంత్రికి లేఖ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు లేఖ రాసినట్టు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత 24 రోజులుగా సమగ్ర ఉద్యోగులు సమ్మెలో ఉన్నారని, వారి సమస్యలకు సానుకూలంగా స్పందించాలని లేఖలో పేర్కొన్నారు.

భీమయ్యక్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

ఈనెల 3, 4 తేదీల్లో మండలంలోని చిన్న పట్నాపూర్ గ్రామంలో కొనసాగే వంగె పురి అయ్యాక్ భీమయ్యక్ ఉత్సవాలను విజయవంతం చేయాలని కుంరం సూరు ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ సోనే రావు అన్నారు. రెండు రోజుల పాటు కొనసాగే ఉత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జాతరకు మాజీ ఎంపీపీకి ఆహ్వానం..

జనవరి 9, 10, 11 తేదీల్లో తిర్యాణి మండలం దంతన్‌పెల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో గల భీమయ్య దేవుని ఆలయంలో జరిగే జాతరకు నిర్వాణ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలు మాజీ ఎంపీపీ మల్లికార్జున్ అందజేశారు.

హమాలీ కార్మికుల సమ్మెకు మద్దతు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమకు పెంచిన రేట్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, సివిల్ సప్లై హమాలి కార్మికులు చేస్తున్న నిరవధిక దీక్షకు గురువారం సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ మాట్లాడుతూ హమాలీ కార్మికులకు పెంచుతున్న రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పౌర సరఫరా సంస్థలో పని చేస్తున్న సివిల్ సప్లై హమాలి కార్మికుల ఎగుమతి, దిగుమతి రేట్ల ఒప్పందం 2023 డిసెంబర్‌తో ముగిసిందని, నూతన రేట్లకు పెంపుపై కార్మిక సంఘాల సమక్షంలో అధికారులు 2024 అక్టోబర్ మూడో తేదీన చర్చలు జరిపి ఎగుమతి దిగుమతి నూతన రేట్లను ప్రస్తుతం ఉన్న రూ.26 నుంచి రూ.29కి అనగా రూ.3 పెంచారని అన్నారు. ఈ పెరిగిన రేట్లను 2024 జనవరి నుంచి అమలు చేస్తామని ఏరియర్స్‌తో సహా చెల్లిస్తామని, మహిళా స్వీపర్‌లకు గోదాముల సామర్థ్యాన్ని బట్టి ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలపై అదనంగా రూ.వెయ్యి ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. హామీలు ఇచ్చి 3 నెలలు పూర్తి కావొస్తున్న ప్రభుత్వం, అధికార యంత్రాంగం సివిల్ సప్లై హమాలి కార్మికులకు కనీసం జీవో కూడా జారీ చేయలేదని విమర్శించారు. ప్రస్తుత పోరాటం నూతన రేట్ల గురించి కాదని, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయమని తాము అడుగుతున్నామన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా, తక్షణమే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు సమ్మె కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, సివిల్ సప్లై వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బొట్టుపల్లి సుధాకర్, లొనరే శ్రీనివాస్, బోటుపల్లి ప్రకాష్, డి.మోహన్ పాల్గొన్నారు.

బోథ్ : సివిల్ సప్లై హమాలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న రిలే నిరహార దీక్షలు గురువారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం ఎదుట హమాలీల సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సివిల్ సప్లై హమాలీల రాష్ట్ర కమిషన్ కుదిరిన రేట్లను 6.0ను ఒప్పందం చేస్తూ, క్వింటాల్‌కు రూ.26 నుంచి రూ.29కి పెంచాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు స్వీపర్‌కు రూ.10లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోరా..?

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని సుల్తాన్ గూడ ఉర్దూ మీడియం పాఠశాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఉర్దూ మీడియం పాఠశాలను నూతన భవనం నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా నేటికీ పూర్తి స్థాయిలో బిల్లులు సదరు గుత్తే దారునికి చెల్లించలేదు. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో అదే పాఠశాలలోని ఓ తరగతి గదిలో అంగన్‌వాడీ కేంద్రంగా కొనసాగుతుంది. ఆ గదికి ఆవరణలో చిన్నారులు కూర్చుంటున్నారు. మధ్యాహ్నం భోజనం కూడా తరగతి ఆవరణలోనే ఏర్పాటు చేస్తున్నారు. అక్కడే గోడకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్విచ్ బోర్డు పెచ్చు లూడి వేలాడుతుంది. విద్యుత్ సరఫరా ఉండడంతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది. పాఠశాలకు ప్రహరీ గోడ లేక పోవడంతో ఆకతాయిలు స్విచ్ బోర్డులు పగల గొట్టినట్టు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఏదేమైనా వేలాడుతున్న ప్రమాదకరంగా మారిన స్విచ్ బోర్డుల నుండి చిన్నారులకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా చూడాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఎస్ఎస్ఏ ఉద్యోగుల మహా ర్యాలీ

- 24వ రోజు కొనసాగుతున్న నిరవధిక సమ్మె
- నేడు రక్తదానం చేసి నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని సర్వీస్ రెగ్యులర్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా 24వ రోజు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శాంతియుతంగా మహారాలీ నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా ప్రధాన ఆస్పత్రి మీదిగా అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగిన ర్యాలీలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సమగ్ర శిక్ష ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలతో పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శి శృతిక, తుకారాం మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ చేయడానికి సమయం పడితే ఆలోపు బేసిక్ పే ఇవ్వాలని కోరుతూ 24 రోజులుగా సమ్మె చేస్తున్నమన్నారు. అయిన ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కమిటీ వేసి నిర్ణయం ప్రకటిస్తామని చెప్పి కాలయాపన చేయకుండా గత సంవత్సరం పీసీసీ హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ లో చేసిన వాగ్దానం ప్రకారం తక్షణం సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి తుకరం, ఉపాధ్యక్షులు నాగసుధ, రమణ, జిల్లా కోశాధికారి బోయిని నాగేష్, మీడియా అధికార ప్రతినిధి సంతోష్, పవన్ కుమార్, కార్యదర్శి దుర్గం సందీప్, కేజీబీవీ ప్రత్యేక అధికారులు నలంద, అరుణ, మీనా, కవిత పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రభుత్వం మొండి వైఖరిని నిరసిస్తూ నిరసన దీక్షలో భాగంగా కలెక్టరేట్ ఎదుట నేడు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు శృతిక, తుకారం తెలిపారు. ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గిరిజన శాఖ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన శాఖలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీఎంహెచ్ బాలికల పాఠశాలలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ ఎన్నికలను రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్, ప్రధాన కార్యదర్శి వాలు సింహ, కోశాధికారి మడావి జైతూ, ఎన్నికల అధికారి ఏసీఎంఓ ఉద్ధవ్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన జిల్లా కార్యవర్గం ఐదేండ్ల పాటు పదవిలో కొనసాగుతారని తెలిపారు. గిరిజన శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు ఉన్నత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని తెలిపారు.

గిరిజన శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడిగా రామచందర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా కోటయ్య, రవి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోచం, జిల్లా సహాయ కార్యదర్శులుగా ఓంకర్, కైలాష్, జిల్లా ఆఫీస్ కార్యదర్శులుగా మహేష్, వసంత్, జిల్లా ప్రచార కార్యదర్శులుగా ఉపేందర్, చిరంజీవి, కోశాధికారిగా చంద్రమోహన్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రేణుక బాయి, శంకర్ ఎంపికయ్యారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా జిల్లా ఈసీ సభ్యులు వనిత, సంగీత, శివ ప్రసాద్, రమేష్, తెలంగారావు, చంద్రయ్య, చంద్రకాంత్, బాపు, మౌనిక, రమణ, సీతారం, వినోద్, వెంకటేష్, సురేందర్, నాందేవ్, లలిత, రాధాభాయిలు ఎంపికయ్యారని వెల్లడించారు.



జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీనియర్ మహిళల జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి ఇద్దరు క్రీడాకారినీలు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గోనే శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ మాట్లాడుతూ అక్టోబర్ 9నుంచి 11వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా తోర్రూర్‌లో జరిగిన 53వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల, పురుషుల హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లా మహిళల జట్టు అత్యుత్యమ ప్రదర్శన కనబర్చి మూడవ స్థానాన్ని సాధించిందని తెలిపారు. ఈ జట్టు నుండి కేరమెరి మండలానికి చెందిన చవాన్ మౌనిక, మందమర్రి మండలంకు చెందిన బుక్య రమ్య జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక పట్ల ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ కోశాధికారి రమేష్ రెడ్డి, డీవైఎస్ఓ రమాదేవి, డీఎస్ఓ మీనారెడ్డి, కోచ్‌లు అరవింద్, కళ్యాణ్, శేఖర్, రాకేష్, సాయి, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. టీఎన్జీవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపి పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సరిగ్గా పని చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా సంఘం అధ్యక్షులు లింగాల రాజశేఖర్, టీఎన్జీవో నాయకులు పొన్న కుమార్, ఈశ్వర్, జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి భోగ మధుకర్, జిల్లా సీనియర్ నాయకులు దేవాజి, జిల్లా ఉపాధ్యక్షులు సిరిసింగుల ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులు తిరుపతి, ఈసీ మెంబర్, సంజీవ్, వసతి గృహ సంక్షేమ అధికారులు కృష్ణ ప్రసాద్, తిరుపతిరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

ఆడె గజేందర్‌ను కలిసిన బోథ్ నాయకులు

నవతెలంగాణ-బోథ్

కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడె గజేందర్‌ను తన నివాసంలో గురువారం బోథ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుర్మే మహేందర్, నాయకులు సాయన్న, కేశవ్, రాజురెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో పీఆర్‌టీయూటీఎస్ నూతన సంవత్సరానికి సంబంధించిన క్యాలెండరును మండల విద్యాధికారి వేణుగోపాల్ రావ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదాశివుడు చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

బోథ్ : పీఆర్టీయూ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ మండలాధ్యక్షులు ఆర్‌టీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సంగు స్వామి, రాష్ట్ర అసోసియేట్ సభ్యులు రాజు చొప్డే, జిల్లా అసోసియట్ సభ్యులు గంగయ్య, ముంతాజ్ ఖాన్, రజిత, హరీష్ కుమార్, షరీపోద్దీన్, వెంకన్న, ఈశ్వర్ పాల్గొన్నారు.

గుట్ట చల్మలో మాజీ ఎంపీపీ దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గుట్టచల్మా గ్రామంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్ గిరిజనులకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత మళ్లీ పెరిగిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పేద గిరిజనులకు చలి నుండి రక్షించే ఉద్దేశంతో దుప్పట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.